

బ్లాక్ లిస్టు పండగ

- అధికారులకు కాసులు కురిపిస్తున్న బ్లాక్ లిస్టులో పెట్టిన రైస్ మిల్లులు
- సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం
- వాటికి ధాన్యం కేటాయించొద్దనే నిబంధనలు
- కానీ డబ్బులు తీసుకొని కొన్నింటికి అప్పగిస్తున్న అధికారులు
- బాయిల్డ్ మిల్లుల విషయంలో చెక్కులను తీసుకొని కేటాయింపులు
- నిబంధనల ప్రకారం సీఎంఆర్ అప్పగించిన మిల్లర్లకు మొండి చేయి





మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పౌరసరఫరాల వ్యవస్థలో అవినీతి, అక్రమాలు ఆగడం లేదు. జీవోల్లోని లొసుగులు.. నిబంధనలను ఎలా బైపాస్ చేయొచ్చో తెలిసిన అధికారుల చేతివాటం మూలంగా అక్రమాల కట్టడి అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ఒక మార్గానికి చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తే.. మరో మార్గాన్ని సృష్టించుకుని యథేచ్ఛగా ప్రభుత్వ ఖజానాను దోచుకుంటున్నారు. తాజాగా వనపర్తి జిల్లాలో జరుగుతున్న ధాన్యం కేటాయింపుల త తంగం చూస్తే అది నిజమనే అభిప్రాయం కలుగుతోంది. గతంలో రూపాయి పెట్టుబడి లేకుండా ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లర్లకు కేటాయించేవారు. వారు ఆ ధాన్యాన్ని అమ్ముకుని.. ఏళ్లుగా సీఎంఆర్ పెండింగ్ పెడుతూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిల్లర్లపై ఉక్కుపాదం మోపేందుకు ఆర్ఆర్ యాక్టు, 50 శాతం బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలనే పలు నిబంధనలు తెచ్చింది. ఏళ్లుగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లులను డిఫాల్ట్ లేదా బ్లాక్ లిస్టు లోకి చేర్చింది. కేసులు ఉన్నా కూడా ధాన్యం కేటాయింపులు చేయవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అధికారులు ఆ ఉత్తర్వులను కూడా బేఖాతరు చేస్తూ డిఫాల్ట్ లేదా బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. కొందరు మిల్లర్లు నిత్యం అధికారులతో మంతనాలు చేసి.. బ్లాక్ లిస్టులో ఉన్న, కేసులు అయిన మిల్లులకు అనుమతులు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులకు అధిక మొత్తంలో డబ్బులు ముడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏవో కారణాలు చూపుతూ, తమ కేటాయింపులు సరైనవిగా చూపించడంలో అధికారులు కూడా పలుమార్లు సఫలీకృతులు అవుతున్నారు. అవినీతిని కట్టడి చేయడానికి చేపట్టిన బ్లాక్ లిస్టు/డిఫాల్ట్ మిల్లులుగా గుర్తించడం అధికారులకు పండగలా మారింది.


పెబ్బేరులోని ఓ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల అధికారులు (ఫైల్)

బ్లాక్ లిస్టు మిల్లులకు కేటాయించ లేదు

మా అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు కేటాయింపులు చేయడం లేదు. క్రిమినల్ కేసులు బుక్ అయిన వాటికి కూడా ధాన్యం ఇవ్వడం లేదు. మంగళవారం సివిల్ సప్లయ్ కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం టెండర్ ధాన్యం పెండింగ్‌లో ఉన్న మిల్లులకు కూడా కేటాయింపులు చేయాలని చెప్పారు. అలాగే ధాన్యం బాగా వస్తున్న నేపథ్యంలో మిల్లుల కెపాసిటీకి డబుల్ ధాన్యం కేటాయింపులు చేయమన్నారు.

- వెంకటేశ్వర్లు, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) వనపర్తి

8 మిల్లులకు కేటాయింపులు..

పౌరసరఫరాల శాఖ ఉత్తర్వుల ప్రకారం డిఫాల్ట్ లేదా బ్లాక్ లిస్టు లేదా 6ఏ ఆఫ్ ఈసీ చట్టం, రేషన్ రీసైక్లింగ్/ కొనుగోళ్ల కేసులు, ఫేక్ ట్రాక్ షీట్లు కలిగిన మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేయొద్దు. అలాగే ఒక మిల్లుపై కేసు ఉంటే.. అతనికి చెందిన మరో మిల్లు ఉంటే దానికీ ధాన్యం కేటాయింపులు చేయకూడదు. కేసు ఉన్న సమయంలో వేరొకరికి లీజ్‌కు ఇచ్చి- మేనేజ్‌మెంట్ మారినా ధాన్యం ఇవ్వకూడదు. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నా ఇవ్వకూడదు. ఎప్పుడైతే సీఎంఆర్ పూర్తిగా అప్పగించి, నో డ్యూ సర్టిఫికెట్ తీసుకుని, 50 శాతం బ్యాంకు గ్యారంటీలను ఇస్తే అప్పుడే కేటాయింపులు చేయాలి. ఇవన్నీ నిబంధనలు

(మిగతా 6లో..)

ధాన్యానికి చెదలు


బుద్దారం గ్రామంలో 8 రోజుల క్రితం కాంట వేసినా మిల్లర్లు తరలించక పోవడంతో చెదలు పట్టిన ధాన్యం బస్తాలు

పది మందికి పట్టె దన్నం పెట్టే అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఆరుగాలం చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే అష్టకష్టాలు తప్పడం లేదు. తెగుళ్లు, నీటి సమస్య, అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకొని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే ధాన్యం బస్తాలకు చెదలు పడుతోంది. ఈ ధాన్యం బస్తాలను చూసి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. దొడ్డు రకం ధాన్యాన్ని తీసుకోవడంపై మిల్లర్లు ఆసక్తి చూపకపోవడంతో తూకం చేసిన ధాన్యాన్ని కూడా తరలించలేకపోతున్నారు. దీంతో రైతులు పగలు, రాత్రి ధాన్యం వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం వచ్చే వరకు ఆరబెట్టాం.. తాలుదబ్బా ఉండొద్దని ప్యాడీ క్లీనర్‌తో తూర్పారబట్టినా ధాన్యం తీసుకోవడానికి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నదాతలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు.

- వనపర్తి, (ఆంధ్రజ్యోతి)

(వివరాలు 6లో..)

- తూకం చేసినా తీసుకెళ్లని మిల్లర్లు
- పట్టించుకోని అధికారులు
- వేధిస్తున్న లారీలు, హమాలీల కొరత
- కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతల పడిగాపులు
- దొడ్డు రకం వడ్లపై ఆసక్తి చూపని మిల్లర్లు
- రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్న కర్షకులు


వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామంలో కాంటా వేసిన ధాన్యం తరలించడం లేదని రాస్తారోకో చేస్తున్న రైతులు

మధురాతి మధురం



- సీతాఫల్‌కు ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నాలు
- ప్రారంభించిన హార్టికల్చర్ యూనివర్సిటీ
- జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ కోసం దరఖాస్తు
- సీతాఫలాల ఉత్పత్తిలో దేశంలోనే పాలమూరు ప్రథమ స్థానం

జడ్చర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యానికి అవసరమైన పోషకాలతో పాటు మధురాతి మధురమైన సీతాఫలానికి పళ్లలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. అటవీ ప్రాంతాల్లో మాత్రమే లభించే సీతాఫలం అంటేనే పాలమూరు గుర్తుకొస్తుంది. సీతాఫలాల ఉత్పత్తిలో దేశంలోనే పాలమూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తోంది. అలాంటి ఫలానికి ప్రత్యేక గుర్తింపు కోసం ఉద్యానవన యూనివర్సిటీ ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రత్యేక జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్) కోసం త్వరలోనే దరఖాస్తు చేయనున్నది.

పోషకాలు, ఔషధ గుణాల భరితం

శీతాకాలంలో దొరికే సీతాఫలాలను ఆంగ్లంలో కస్టర్డ్ యాపిల్ అంటారు. షుగర్ ఆపిల్, స్వీట్ సోప్ అని కూడా పిలుస్తారు. ఈ పండులో పోషకాలు మెండుగా ఉంటాయి. మొక్క వేర్లు, ఆకులు, కాయలు అన్నింటిలోను ఔషధగుణాలున్నాయి. ఎలాంటి రసాయనాలు లేకుండా, సహజ వాతావరణ పరిస్థితుల్లో పండుతుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ రకం సీతాఫలానికి దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆ గుర్తింపు కోసం సీతాఫల ప్రేమికులు, పరిశోధకులు ప్రయత్నాలు ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో పాలమూరు సీతాఫలానికి

(మిగతా 6లో..)


విక్రయానికి ఉంచిన సీతాఫలాలు(ఫైల్)

అనుమతులు రద్దు చేయాలి

- స్పష్టం చేసిన సిరసనగండ్ల రైతులు
- మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న కల్వకుర్తి ఆర్డీవో శ్రీను

7

వేసవి శిబిరాలకు సన్నాహాలు

- 'యంగ్ ఇండియా' పేరుతో నిర్వహణ
- తొలిసారి ప్రభుత్వ బడుల్లో ఏర్పాట్లు
- కసరత్తు చేస్తున్న విద్యాశాఖ

7


పిల్లర్లకే పరిమితమైన జిల్లా గ్రంథాలయ నూతన భవనం

జిల్లా గ్రంథాలయ భవనం పూర్తయ్యేదెన్నడు?

- పిల్లర్ల వద్ద ఆగిపోయిన నిర్మాణ పనులు
- ఇరుకు గదుల్లో పాఠకులకు తప్పని అవస్థలు
- జోగులాంబ గద్వాల జిల్లాలో 13 లైబ్రరీలు

6

బీజేపీ కుట్రలను ప్రతీ గడపకు వివరించాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


జైబాపు, జైభీమ్, జై సంవిధాన్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, కార్యక్రమ కోఆర్డినేటర్లు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సొంతంగా పార్టీని నిలుపుకోలేక వెంటిలేటర్‌పై ఉన్న బీజేపీ భారత రాజ్యాంగంపై చేస్తున్న కుట్రలను ప్రతీ గడపకు వివరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమ రాష్ట్ర సమన్వయకర్త గద్దర్ కూతురు వెన్నెల, జిల్లా కోఆర్డినేటర్లు అహ్మద్ నసీర్, సంజీవ్ ముదిరాజ్‌లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు మెచ్చిన భారత రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం నాలుగు గోడల మధ్యలో మార్చాలనే కుట్రలు చేస్తోందన్నారు. నిటారుగా నిలబడే శక్తి లేని కేసీఆర్ తన కుటుంబ సమేతంగా ఢిల్లీలో సోనియా గాంధీ కాళ్లు మొక్కి.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నెంబర్ వన్ విలన్ అంటావా అని ప్రశ్నించారు. సమసమాజ సమానత్వాన్ని మొదటగా మన ఇంటి నుంచే ప్రారంభించాలని గద్దర్ కూతురు వెన్నెల అన్నారు.. అహ్మద్ నసీర్, సంజీవ్ ముదిరాజ్ మాట్లాడారు. అనంతరం ఫంక్షన్ హాల్ నుంచి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, గౌరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి పొంగులేటి రాక

- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి



మంత్రి ప్రారంభించనున్న నమూనా ఇందిరమ్మ ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ఆదర్శ్ సురభి

వనపర్తి/పెద్దకొత్తపల్లి/కోడేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నేడు వనపర్తి జిల్లాలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సుతో పాటు, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేసేందుకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రానున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న హెలిప్యాడ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం తన ఛాంబర్‌లో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నూతనంగా నిర్మించిన పీజీ విద్యార్థుల వసతి భవనం, అధ్యాపకుల భవనం, మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడే రేవల్లి, ఏదుల, శ్రీరంగాపూర్ గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఆధునీకరించిన బీసీ బాలుర కళాశాల వసతి గృహం, అంబేడ్కర్ చెరువు సుందరీకరణ ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కల్యాణసాయి గార్డెన్ ఫంక్షన్ హాల్లో రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, రోడ్లు భవనాలు కార్యనిర్వాహక ఇంజనీరు దేశ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, పీడీ హౌసింగ్ పర్వతాలు తదితరులు ఉన్నారు.

నేడు పెద్దకొత్తపల్లికి మంత్రి దామోదర

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించనున్న భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు హాజరవుతారని వ్యవసాయ అధికారి రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కోడేరు మండలంలోని పీఏసీఎస్ న్యూ గోదాంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు రైతులు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలి

- అదనపు కలెక్టర్ దేవసహాయం


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అమలు చేయాలని నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా జిల్లా నీటి పారిశుధ్య కమిటీతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలని, విస్తృతంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. డిసెంబరు 2025 నాటికి జిల్లాలోని అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా మార్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చిన్నఓబులేసు, డీపీఓ రాంమ్మోహన్‌రావు, డీఈవో రమేష్‌కుమార్, డీఏవో ఉన్నారు.

ఉక్కబోత... ఉక్కిరి బిక్కిరి

» ఉమ్మడి జిల్లాలో గరిష్ఠంగా నమోదవుతున్న ఎండలు

నారాయణపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండలు అత్యధికంగా నమోదవుతున్నాయి. మంగళవారం అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 40.1 డిగ్రీలు, కనిష్ఠం 23.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో గరిష్ఠం 39.6 డిగ్రీలు, అత్యల్పంగా చిన్నంబావి మండలంలో 26.0 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 39 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లా గరిష్ఠంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత, కనిష్ఠంగా 28, నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 37 డిగ్రీలు, కనిష్ఠం 26 డిగ్రీలు నమోదైంది.

చిన్నారులకు భగవద్గీత పరాయణం

కల్వకుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని శ్రీలక్ష్మి పద్మావతివేంకటేశ్వరస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేసవి కాలం శిబిరం మంగళవారం నిర్వహించారు. పిల్లలకు భగవద్గీత పఠనం నేర్పించనున్నట్లు నిర్వాకులు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6గంటల నుంచి 7 గంటల వరకు నేర్పించనున్నట్లు తెలిపారు. భగద్గీత పఠనం ఉపాసకులు, తెలుగు పండితులు రవిచంద్ర నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కల్వ మనోహర్, మాజీ ఎంఈవో కృష్ణయ్య, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆందోళన

» ధాన్యం కొనుగోలులో తరుగు తీస్తున్నారని, కొన్నా తరలించడంలేదని ఆవేదన

» ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలుచోట్ల రాస్తారోకోలు



కొనుగోలు చేసిన ధాన్యం తరలించాలని గోవర్ధనగిరిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

వీపనగండ్ల/గోపాల్‌పేట/కల్వకుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పంట చేతికొచ్చి అమ్ముకుంటున్న వేళ ఎదురౌతున్న సమస్యలతో రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ధాన్యం కొనుగోలులో పరిమితికి మించి తరుగు తీస్తున్నారని, కొన్న ధాన్యాన్ని తరలించడంలో ఆలస్యం చేయడంతో నష్టం వాటిల్లుతోందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలుచోట్ల రైతులు మంగళవారం రాస్తారోకోలు నిర్వహించారు.

వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం గోవర్ధనగిరిలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రంలో కొనుగోళ్లు వారం రోజులుగా నిలిపివేశారు. మిషన్ ద్వారా తాలు తొలగించాలని ఆ తరువాత కొనుగోలు చేస్తామని నిర్వాహకులు తేల్చి చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన రైతులు కొనుగోలు ప్రారంభించాలని గ్రామంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. తహసీల్దార్ వరలక్ష్మి అక్కడికి చేరుకొని రాస్తారోకోను విరమించాలని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. బుధవారం వరకు సమస్యను పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతులు మేకల ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ముంత పరమేష్, నరసింహ, గుంటి మహేష్, బిచ్చారెడ్డి, మేకల వెంకటేష్ పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామంలో రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంట చేసి లారీలు రాక కొనుగోలు కేంద్రాలలో రోజుల కొద్ది వేల కొద్ది బస్తాలు నిల్వ ఉన్నాయని, వర్షాలు, ఈదురు గాలులకు ధాన్యం తడిసి బస్తాలు చెదలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ నరేష్ కుమార్, తహసీల్దార్ తిలక్‌రెడ్డి వచ్చి రైతులకు నచ్చజెప్పి ఉన్నతాధికారులతో మాట్లాడి లారీలు రప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ధాన్యం కొనుగోలులో తరుగు తీయొద్దని నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేశారు. రోడ్డు పై ధాన్యంపోసి తగులబెట్టారు. 40 కిలోల బస్తాకు మూడు కిలోల తరుగు తీస్తున్నారని మిల్లర్లు కట్టింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



కొనుగోలు చేసే ధాన్యంలో తరుగు తీయొద్దని కల్వకుర్తిలో పంటకు నిప్పుపెట్టిన రైతులు



పోటీ పరీక్షలకు అందుబాటులో ఉంచిన పుస్తకాలు



జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

జిల్లా గ్రంథాలయ భవనం పూర్తయ్యేదెన్నడు?

» పిల్లర్ల వద్ద ఆగిపోయిన నిర్మాణ పనులు

» ఇరుకు గదుల్లో పాఠకులకు తప్పని అవస్థలు

» జోగుళాంబ గద్వాల జిల్లాలో 13 లైబ్రరీలు

గద్వాల టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అనంతరం ఏర్పాటు చేసిన జిల్లా గ్రంథాలయం అభివృద్ధి మూడగులు ముందుకు... ఆరడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో 2016 వరకు కొనసాగిన శాఖా గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంగా మారినా అందుకు తగిన సౌకర్యాలు కల్పించకపోవడం సమస్యగా మారింది. జిల్లా గ్రంథాల య సంస్థ తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీఎస్ కేశవ్ అప్పటి ప్రభుత్వానికి సమస్యను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చే యించారు. రూ.1.50 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించనున్న జిల్లా గ్రంథాలయ భవనానికి అప్పటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన కూడా చేశారు. నిర్మాణ పనులను మునిసిపాలిటీ పరిధిలోని పబ్లిక్ హెల్త్ విభాగానికి అప్పగించారు. వనపర్తి మునిసిపాలిటీకి చెందిన పబ్లిక్ హెల్త్ వి భాగం ఆధ్వర్యంలో టెండర్లు ఖరారు చేసి, 2022లో ప నులను ప్రారంభించారు. పునాదులు, పిల్లర్ల వరకు పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్, బిల్లులు అందక పోవడంతో నిలిపివేశారు. అనంతరం శాసనసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దీన్ని ఎవరూ పట్టించుకోలే దు. ఎన్నికల అనంతరం ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఇప్పటివరకు నిధులను విడుదల చేయలేదు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



సమస్యను ఇప్పటికే జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాం. జిల్లాలోని గ్రంథాలయాల పరిస్థితిని వివరిస్తూ ప్రభుత్వానికి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థకు త్వరలోనే లేఖలు రాయనున్నాం. గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తికి నిధుల కేటాయింపు కోసం త్వరలోనే కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తాం.

- నీలి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్

అభివృద్ధి శూన్యం

గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామంటూ ప్రతీ సంవత్సరం నిర్వహించే వారోత్సవాల సందర్భంగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 9 శాఖా గ్రంథాలయాలు, 4 గ్రామీణ గ్రంథాలయాలు, మొత్తం 13 ఉన్నాయి. వాటిలో గట్టు, అలంపూర్, మానవపాడు, ధరూర్ గ్రంథాలయాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మిగతావి గ్రామ పంచాయతీలు, దాతల సహకారంతో ఉచిత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లాకు 8 లైబ్రేరియన్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ పోస్టు ఒకటి ఉండగా, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మరొకరిని నియమించారు. జిల్లా గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగులు అధిక సంఖ్యలో వస్తుండగా, వారికి సరిపోయేటన్ని కుర్చీలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇరుకు గదుల్లో అసౌకర్యాల మధ్యనే నిరుద్యో గులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం జిల్లా గ్రంథాలయంలో 22,815 పుస్తకాలు ఉన్నాయి. అలంపూర్‌లో 3,300, మాన వపాడులో 3,120, అయిజలో 2,714, గట్టులో 2,107, ధరూర్ 2,402, ఇటిక్యాలలో 1,120, మల్దకల్‌లో 1,719, వడ్డేపల్లిలో 1,466 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయాలని పాఠకులు కోరుతున్నారు.

మధురాతి మధురం

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు.

మార్కెట్లో పెరగనున్న డిమాండ్

ఎక్కడాలేని విధంగా ఒక ప్రాంతానికి పరిమితమై ఉండి, ప్రత్యేకత కలిగిన ఉత్పాదనలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్‌ను కేటాయిస్తారు. ఈ గుర్తింపుతో పేటెంట్ హక్కు లభిస్తుంది. దీన్ని నమోదు చేసుకున్న అధీకృత ఉత్పత్తిదారులు మాత్రమే ఆ పేరును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇలా భౌగోళిక గుర్తింపు లభిస్తే ఆ ఉత్పత్తులకు న్యాయపర మైన రక్షణ కూడా కల్పించినట్లు అవుతుంది. అలాగే వాటికి మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులలో ఇప్పటికే తాండూరు కందిపప్పుకు, వరంగల్ చపాటా మిర్చికి జీఐ గుర్తింపు లభించింది. అలాగే బాలానగర్ రకం సీతాఫలానికి జీఐ ట్యాగ్ కోసం నాబార్డు సహకారంతో ఉద్యాన వర్సిటీ త్వరలోనే దరఖాస్తు చేయనున్నది.





పాలమూరు ప్రత్యేకతను చాటే బాలానగర్ రకం సీతాఫలం

6 మండలాలు, 30 గ్రామాల్లో పండ్లు

సీతాఫలానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ కోసం నాబార్డు ఫైనాన్స్ సహకారం, ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దరఖాస్తు చేసేందుకు సిద్ధం అయ్యారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని 6 మండలాలు, 30 గ్రా మాలో బాలానగర్ రకం సీతాఫలం పండుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట మండలాలు, వికారాబాద్ జిల్లాలోని చౌడాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు, చౌదరిగూడెం మండలాల పరిధిలో బాలానగర్ రకం సీతాఫలం చెట్లు విస్తరించి ఉన్నాయి. నవాబ్‌పేట మండలం పోమాల్‌లో సీతాఫలం గుజ్జు తయారీ కేంద్రం ఉంది. ఇక్కడ తయారు చేసిన గుజ్జును ఐస్‌క్రీమ్‌లలో వినియోగిస్తున్నారు. అలాగే నాబార్డు ఆధ్వర్యంలో బాలానగర్‌లోని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీతాఫలం గుర్తింపుపై దృష్టి సారిస్తోంది.

రెండేళ్ల నుంచి పరిశోధన



పాలమూరు జిల్లా, బాలానగర్ ప్రాంతంలోని సీతాఫలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు దాదాపు రెండు సంవత్సరాల నుంచి క్షేత్రస్థాయి పరిధోశన చేస్తున్నాను. గణాంకాల సేకరణతో పాటు వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నాను. ప్రత్యేకతతో పాటు విశిష్టత కలిగిన ఈ రకం సీతాఫలం ప్రత్యేకరుచికి కారణాలు ఏమి ఉంటాయనే కోణంలో భూమిలోని లవణాలపైనా పరిశోధనలు చేస్తున్నాను. మే 15వ తేదీన చెన్నయ్‌లోని జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ కేంద్ర కార్యాలయంలో పాలమూరు సీతాఫలానికి ప్రత్యేక గుర్తింపు కోసం దరఖాస్తు చేయనున్నాం.

- ప్రొఫెసర్ సైదయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం

మూడేళ్లుగా గుజ్జు తయారీ కేంద్రం



సీతాఫలంపై ఐదు సంవత్సరాలుగా పరిశోధన చేస్తున్నాం. మూడేళ్ల క్రితం నవాబ్‌పేట మండలం పోమాల్‌లో సీతాఫలం గుజ్జు తయారీ కేంద్రం ఏర్పాటు చేశాం. ఇక్కడ తయారైన సీతాఫలం గుజ్జును ఐస్‌క్రీమ్‌లలో వినియోగిస్తున్నారు. ఈ పండ్లకు ప్రత్యేక గుర్తింపు కోసం కృషి చేస్తున్నాం.

-నరేందర్‌రెడ్డి, పాలమూరు రైతు డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు :

బ్లాక్ లిస్టు పండగ

(5వ పేజీ తరువాయి)

ఉన్నా అధికారులు బేఖాతరు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. డీఫాల్ట్ లేదా కేసులు ఉన్న మిల్లుల్లో దాదాపు 8 మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసినట్లు సమాచారం. పెబ్బేరు మండలంలోని ఓ మిల్లు సీఎంఆర్ అప్పగించకపోవడం, రెండు కోడ్లతో బురిడీ కొట్టించిన మిల్లర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టారు. కానీ అదే మిల్లర్‌కు చెంది, పేరు వేరే ఉందనే సాకు చూపి ధాన్యం కేటాయింపులు చేశారు. ఖిల్లాఘణపురం మండలం సోలిపూర్‌లోని ఒక మిల్లుపై కేసు పెండింగ్‌లో ఉంది. సదరు మిల్లుకు ధాన్యం కేటాయింపులు చేయడానికి లేదు. అయితే అదే మిల్లర్‌కు చెందిన మరో మిల్లుకు ధాన్యం కేటాయింపులు చేశారు. సదరు మిల్లర్ మిల్లర్ల అసోసియేషన్‌లో కీలక వ్యక్తి కావడమే అందుకు కారణంగా తెలుస్తోంది. అలాగే ఆయన చుట్టూ ఉన్న మరికొందరు మిల్లర్లకు కూడా కేటాయింపులు చేసినట్లు సమాచారం. కానీ ఆ విషయాలు బయటకు పొక్కనివ్వకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అనువు కాని చోట మరోలా..

పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు అందరికీ ఒకే విధంగా వర్తించాలి. తమ, పర బేధం ఉండకూడదు. కానీ అనువుగా ఉండి.. అమ్యామ్యాలు ముట్టిన మిల్లులకు ఒకలా, అనువు కానిచోట మరోలా అధికారుల శైలి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు పేరు వేరే అని చెప్పి కొందరికి కేటాయింపులు చేయడం కోసం లొసుగులను వాడుకుంటున్న అధికారులు.. సోలీపూర్ మిల్లులకు కేటాయింపులు చేశారు. అదే సమయంలో వనపర్తి పట్టణంలోని ఓ మిల్లుపై కేసు ఉండి బ్లాక్ లిస్టులో ఉంది. ఆయన వేరే మిల్లు నిర్మించుకుని దరఖాస్తు చేస్తే.. ఆయనకు మాత్రం కేటాయింపులు చేయడం లేదు. అలాగే పెండింగ్ సీఎంఆర్ ఉన్న బాయిల్డ్ మిల్లులకు కేటాయింపులు చేయవద్దు. కానీ ముందస్తు చెక్కులు తీసుకుంటున్నామని చెప్పి వాటికీ కేటాయింపులు చేస్తున్నారు. ఇదే నిబంధన అన్ని బాయిల్డ్ మిల్లులకు మాత్రం వర్తించడం లేదు. సీఎంఆర్ సరిగా అందించిన మిల్లర్లకు కూడా సాకులు చూపుతూ కేటాయింపులు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చి.. అక్రమార్కులకు అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేటి నుంచి బొడ్రాయి ఉత్సవాలు

» అచ్చంపేటలో పండుగ వాతావరణం



విద్యుత్‌కాంతులతో వెలుగుతున్న అచ్చంపేట

అచ్చంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో బుధవారం నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 5 వరకు వేడుకలు కొనసాగుతాయని మునిసిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బొడ్రాయి ప్రతిష్ఠ, గ్రామ దేవత పోషమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట పట్టణం ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు, వారి బంధు మిత్రులతో తరలివస్తుండటంతో పట్టణంలో సందడి నెలకొన్నది.

కార్యక్రమాల వివరాలు

- జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీ స్వామి ఆధ్వర్యంలో బుధవారం బొడ్రాయి జీర్ణోద్ధరణ, పూర్ణ కుంభ వాహన సేవ నిర్వహించనున్నారు.
- గురువారం ఉదయం బొడ్రాయి, పోచమ్మ అమ్మవారి విగ్రహాల ఊరేగింపు, అభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సుగంధ ద్రవ్యాలతో జలాధివాసం ఉంటుంది.
- శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గోపూజ, ప్రధాన ప్రతిష్ఠా మహోత్సవం, దీక్ష బంధనం ఉంటాయి. బ్రహ్మ కలశస్థాపన అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు యాగశాలలో దేవత పూజలు, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు పోచమ్మ అమ్మవారి విగ్రహానికి ధాన్యాధివాసం చేస్తారు.
- శనివారం ఉదయం 7 గంటలకు యాగశాలలో మండప దేవతార్చన, అష్టదిక్పాలక ప్రధాన హోమం, అమ్మవార్ల పీఠ పూజ ఉంటాయి. భక్తుల ఆధ్వర్యంలో క్షీరాధివాసం, సాయంత్రం 4 గంటలకు కన్య పూజోత్సవం, ప్రధాన ప్రతిష్ఠా దేవత యంత్ర బింబానికి శయ్యాధివాసం ఉంటాయి.
- ఆదివారం ప్రతిష్ఠ హోమం, మహా పూర్ణాహుతి, శీతల యంత్ర స్థిత బొడ్రాయి, పోచమ్మ అమ్మవార్ల ఆలయ పునర్ నిర్మాణ యంత్రబింబ విగ్రహ ప్రతిష్ఠ ఉంటాయి. ఉదయం 10గంటలకు మహదాశీర్వచనం, సాయంత్రం 6 గంటలకు బోనాల సమర్పణ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సమారాధన, రాత్రి 9 గంటల నుంచి కోట మైసమ్మ కల్యాణం ఉంటాయి. అనంతరం గ్రామం చుట్టూ పొలి వేస్తారు. తెల్లవారుజామున పొలిని తొలగిస్తారు.
- సోమవారం బంధు మిత్రులు, సపరివారంతో విందులు, వినోద కార్యక్రమాలు నిర్వహించుకుంటారు.

ధాన్యానికి చెదలు

» తూకం చేసినా తీసుకెళ్లని మిల్లర్లు

» పట్టించుకోని అధికారులు

» వేధిస్తున్న లారీలు, హమాలీల కొరత

» కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతల అవస్థలు

» దొడ్డు రకం వడ్లపై ఆసక్తి చూపని మిల్లర్లు

» రోడ్లపైకి వచ్చి నిరసన



ధాన్యం కొనుగోలు చేయాలని , కాంట వేసిన ధాన్యాన్ని తరలించాలని పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వనపర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో సి బ్బంది తప్పిదాలతో అన్నదాతలు ఆగమవుతున్నారు. దొడ్డు రకం ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు ఆసక్తి చూపకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యం గా ప్రారంభించడం, కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొను గోలు విషయంలో నిర్లక్ష్యం చేయడంతో తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో కేంద్రాలలో ధాన్యం బస్తాలకు చెదలు పడుతోంది. గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో 8 రోజుల కిందట తూకం చేసినా మిల్లర్లు తీసుకువెళ్లకపోవడంతో ధాన్యం బస్తాలకు చెదలు ప ట్టింది. దీంతో అన్నదాతలు ఆగ్రహించి రోడ్డుపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు.

తప్పిన అధికారుల అంచనా...

వనపర్తి జిల్లాలో యాసంగిలో 1,40,346 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇందులో దొడ్డురకం 60,707 ఎకరాలు, సన్నరకం 79,639 ఎకరాల్లో సాగుచేశారు. ఇందులో దొడ్డు రకం 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 2.70 లక్షలు మొత్తం దాదాపు 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ఇంటి అవసరాలకు, ప్రైవేటులో విక్రయించడాలు పోను 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. కానీ అందుకు సరిపడా మిల్లులు, లారీలు ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తీవ్రమవుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, అందులో 23వేల మెట్రిక్ టన్నులు సన్న రకం, 19 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ధాన్యాన్ని సేకరించారు. విక్రయించిన ధాన్యానికి కూడా సకాలంలో డబ్బులు పడకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

ప్రధాన సమస్య ఇదే

రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఇప్పటికీ సగం మిల్లర్లు కూడా బ్యాంకు గ్యారెంటీ ఇవ్వలేదు. బ్యాంకు గ్యా రెంటీ ఇచ్చిన 33 రా రైస్ మిల్లులకు, 4 బాయిల్డ్ మి ల్లులకు మాత్రమే ధాన్యం కేటాయింపు చేశారు. ఇందు లో రా రైస్ మిల్లుల యజమానులు దొడ్డు రకం ధా న్యాన్ని తీసుకోవడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల లోడింగ్, అన్‌లోడింగ్ ఆలస్యమవుతోంది. దీంతో ధా న్యం సేకరణ, తరలింపు విషయంలో ప్రధాన సమస్య గా మారిందని అధికారులు చెబుతున్నారు. ఈ విష యంపై ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నామ ని రెండు మూడు రోజుల్లో సమస్య ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రోడ్డెక్కుతున్న అన్నదాతలు

ధాన్యం సేకరణ, తరలింపులో అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో మండిపడుతున్నారు. జిల్లాలో లారీల కొరతతో ధాన్యం సేకరణ ఆలస్యంగా జరుగుతోంది. కాంటా చేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో అన్నదాతలు ఆగ్రహానికి గురవుతున్నారు. రోజుల తరబడి రాత్రి పగలు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించి విసుగు చెందిన అన్నదాతలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా మిల్లుకు తరలించే వరకు రైతులదే బాధ్యత అని నిర్వాహకులు చేతులు దులుపుకుంటున్నారు. వారం రోజుల క్రితం ధాన్యం తరుగు విషయంలో వనపర్తి మండల పెద్దగూడెం తండాకు చెందిన రైతులు రాస్తారోకో చేశారు. మంగళవారం గోపాల్‌పేట మండల బుద్దారం, పెబ్బేరు మండల గుమ్మడం గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని కాంట చేసి 15 రోజులు అవుతున్నా ధాన్యాన్ని తరలించడం లేదని రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ధాన్యాన్ని తీసుకువచ్చి 27 రోజులవుతోంది..



ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పండించాను. గత 27 రోజుల క్రితం పంట కోసుకొచ్చి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చాను. 8 రోజుల క్రితం ఐకెపి సెంటర్ వద్ద ధాన్యం విక్రయించగా 396 సంచులు అయ్యాయి. ఇప్పటి వరకు ఆ ధాన్యాన్ని తరలించలేదు. నెల రోజులకు పైగా ఇక్కడే రాత్రి, పగలు కావలి ఉండాల్సి వస్తుంది. సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

- కావలి వెంకటస్వామి, బుద్దారం

క్రైం కార్నర్

తిరుమలలో గద్వాల వాసి మృతి

» మూర్ఛవ్యాధితో మరుగుదొడ్డిలోనే కుప్పకూలాడు

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఒక పబ్లిక్ మరుగుదొడ్డిలో మంగళవారం గద్వాల వాసి ఒకరు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గద్వాలకు చెందిన సురేశ్‌గౌడ్(40) ఇరవై రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. అయితే సురేశ్ గౌడ్ తిరుమలలో ఉంటున్నాడనే సమాచారంతో వారు రెండు రోజుల కిందట అక్కడికి చేరుకుని గాలిస్తున్నారు. మంగళవారం ఉదయం సీఆర్వో కార్యాలయం వద్దనున్న మరుగుదొడ్డిలో ఒక వ్యక్తి మృతదేహం ఉందని తెలిసి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడు సురేశ్‌గౌడ్ అని నిర్ధారించుకుని వారు కన్నీరుమున్నీరయ్యారు. కొంతకాలంగా సురేశ్‌గౌడ్ మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడని, అనారోగ్యంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బాలానగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రంలోని దుందుభీవాగులో మంగళవారం గుర్తు తెలియని మృత దేహం లభ్యమైంది. మండల కేంద్రంలోని సాదు వెంకట్‌రెడ్డి వెంచర్ సమీ పంలోని, దుందుభి వాగులో తేలిన పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. అతడి వయసు 40 నుంచి 45 వర కు, ఎత్తు 5.2 ఫీట్లు ఉండొచ్చని తెలిపారు. అతడి ఒంటిపై ఆకుపచ్చ టీ షర్టు, ప్యాంట్ ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని జడ్చర్ల జనరల్ ఆసు పత్రికి తరలించారు. గ్రామ కార్యదర్శి జగన్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

దాయాదుల మధ్య ఘర్షణ

» ఒకరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన వడ్ల నారాయణ

గద్వాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని కొండపల్లి గ్రామంలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం జరిగిన ఈ ఘటనపై గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్ల ఎల్లప్ప తన దొడ్డిలో, ఆయన సోదరుడి పిల్లలు కూడా మేతను నిల్వ చేసుకునేందుకు గతంలో అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం అవసరాలు పెరిగిపోవడంతో అక్కడే ఒక ఇంటిని నిర్మించుకున్నారు. తమ స్థలంలో మేతను నిల్వ ఉంచుకోవడానికి గతంలో అవకాశం ఇచ్చామని, ఇప్పుడు ఇవ్వలేమని ఎల్లప్ప కుమారుడు వడ్ల నారాయణ తన పెద్దనాన్న కు మారుడు నర్సింహులుకు తెలిపాడు. మేతను మరోచోట నిల్వ చేసుకోవాలని సూచించాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దారి తీసింది. నర్సింహులు, ఆయన కుమారుడు నాగన్నలు వడ్ల నారాయణపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు ఆయనను గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు బాధితుడి సోదరుడు వడ్ల రమేశ్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వంగూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండారెడ్డిపల్లి-పోల్కంపల్లి రహదారిలో కేఎల్‌ఐ కాల్వ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఉప్పునుంతల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన సత్యం బైక్‌పై వెళ్తున్నాడు. చీకటి కావడంతో రోడ్డుపై ఉన్న వరికుప్పను గమనించక, దానికి బైక్ ఢీకొనడంతో సత్యం తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భాగవత శ్రవణంతో కష్టాలు దూరం

- విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లోదాచార్యులు

- నరసాచలంలో కొనసాగుతున్న స్వర్ణోత్సవాలు


పవమాన హోమం చేస్తున్న పండితులు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గోవింద తీర్థ స్వాములు

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భాగవత శ్రవణంతో కష్టాలు దూరం అవుతాయని ప్రవచనకారుడు, ఉత్తరాది మఠానికి చెందిన విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లోదాచార్యులు అన్నారు. నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలంలోని నరసాచలం భూ వేంకటేశ్వరస్వామి స్వర్ణోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం భాగవత సప్తాహం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్వాన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలని, ఆధ్యాత్మిక చింతనను పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్వాన్ జయతీర్థాచారి, అనీల్ దేశాయ్ ఆధ్వర్యంలో వాయుస్తుతి పునఃచరణ హోమం నిర్వహించారు. రాయిచూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు శేషగిరి దాసుల హరిదాస కచేరీ అందరినీ అలరించింది. ఉడిపికి చెందిన విద్వాన్ వంశీకృష్ణాచార్య లక్ష్మీ శోభాన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గోవింద తీర్థ స్వాములు, పేట శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, భూశ్రీనివాస సేవాసమతి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్‌రావు, జయతీర్థాచారి, శ్రీపాద్, శ్రీనివాస్, భీంసేనాచారి, హన్మేశ్, ప్రకాశ్, శేషు పాల్గొన్నారు.

బీవోఎస్ సభ్యుడిగా రామ్‌లక్ష్మణ్


రామ్‌లక్ష్మణ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా ఫిజికల్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సభ్యుడిగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యాయామ సంచాలకులు డాక్టర్ రామ్‌లక్ష్మణ్ నియమితులయ్యారు. తనకు బీవోస్ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు పాలమూరు యూనివర్సిటీ వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాయమ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సాహితీ సంబురాలకు ధన్వాడ కళాకారుడు


బాలకృష్ణ

ధన్వాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలకు ధన్వాడకు చెందిన కళాకారుడు, రంగస్థల నటుడు మొల్కొమొల్ల బాలకృష గౌడ్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వచ్చేనెల 10 నుంచి నిర్వహించనున్న ప్రపంచ సాహితీ సంబురాల్లో ఆయన పాల్గొననున్నారు. ఏలురులోని గోపాలస్వామి కల్యాణ మండపంలో సంబురాలతో పాటూ సాహితీ పట్టాభిషేక మహోత్సవం నిర్వ హించనున్నారు.

విద్యార్థుల కోసం.. ఇంటింటి ప్రచారం



» ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యత్నం

» ఉపాధ్యాయులకు లక్ష్యాల నిర్దేశం

» కరపత్రాలు, బ్రోచర్ల పంపిణీ

వనపర్తి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రవేశాల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. ఆ లక్ష్యాలను సాధించేందుకు వారు మండుటెండలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులును కలుస్తున్నారు. తమ పాఠశాల ప్రత్యేకతలు, విశిష్టతలను వివరిస్తూ, ఆకర్షణీయమైన బ్రోచర్లు కరపత్రాలను పంచుతున్నారు. పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ వ్యవహారం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది.

ఉదయం 7 గంటల నుంచే..

ప్రతీ ఒక్కరూ 10 నుంచి 20 మందిని పాఠశాలలో చేర్పించాలంటూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు టార్గెట్లు విధించాయి. చేర్పించకపోతే విధులు, వేతనాల విషయంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు ఉదయం ఏడు గంటల నుంచే ప్రచారాన్ని మొదలు పెడుతున్నారు. జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో కాలినడకన ఇంటింటికీ తిరుగుతున్నారు. సమీప గ్రామాలకైతే పాఠశాలకు సంబంధించిన వాహనాల్లో వెళ్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడుతున్నారు. ప్రీ అడ్మిషన్ల పేరుతో పిల్లలను బడిలో చేర్పించేందుకు యత్నిస్తున్నారు. ఫీజులో రాయితీలు ఇస్తామని చెప్తూ వారిని ఒప్పించేందుకు యత్నిస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలున్నాయి. ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవోలు అమలు చేయడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతీ పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానం ఉండాలి. పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి. అలాగే కొన్ని పాఠశాలల్లో సరైన విద్యార్హతలు లేని వారితో బోధన చేయిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఫీజులతో పాటు పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు బడుల్లోనే విక్రయిస్తూ తల్లిదండ్రులనుంచి వేలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలి. చాలా వరకు పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ సౌకర్యాలు లేవు. ఇరుకు గదులు , చుట్టు వా హనాలు తిరిగే స్థలాలు లేని భవనాల్లో స్కూళ్లను ఇష్టానుసారంగా నడిపిస్తున్నారు. బీఈడీ పూర్తి చేసిన వారికి విద్యాబ్యాసం చేయాల్సి ఉండగా చాలా చోట్ల విద్యార్హత లేని వారితో చదువులు కొనసాగిస్తున్నారు. ఫీజుల వివరాలు బోర్డు పైన ప్రదర్శించాల్సి ఉంటే ఏ పాఠశాలలో కూడా అలా జరగలేదు. చాలా ప్రైవేటు పాఠశాలలో ఇలా నిబంధనలకు విరు ద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా రనేది ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రచారం చేయొద్దు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయొద్దు. ఒక వేళ మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన ఉంటుంది. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలను పాటించని ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం.

- అబ్దుల్ ఘని, డీఈవో, వనపర్తి

వేసవి శిబిరాలకు సన్నాహాలు

» 'యంగ్ ఇండియా' పేరుతో నిర్వహణ

» తొలిసారి ప్రభుత్వ బడుల్లో ఏర్పాట్లు

» కసరత్తు చేస్తున్న విద్యాశాఖ

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం రాష్ట్రంలో తొలిసారి 'యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు' పేరుతో శిబిరాలను నిర్వహించనున్నది. అందుకోసం జిల్లా అధికార యంత్రాంగం ప్రతిపాదనలను సిద్ధం చేసింది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న 99 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిబిరాలను నిర్వహించనున్నారు. వచ్చే నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు కొనసాగించే ఈ శిబిరాలు ప్రతీ రోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కొనసాగుతాయి.

వలంటీర్ల నియామకం

ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో వేసవి శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు, అతడికి సహకరించేందుకు ఒక ఉపాధ్యాయుడికి బాధ్యతలను అప్పగిస్తారు. వివిధ అంశాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఒక వలంటీర్‌ను నియమించనున్నారు. వారికి రూ. 2500 గౌరవ వేతనం ఇవ్వనున్నారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన పరికరాలు, ఇతర ఖర్చుల కోసం రూ. 44 లక్షలు అవసరం ఉన్నట్లు ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదనలను పంపించింది.

12 అంశాలపై తరగతులు

యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులకు 12 అంశాలపై తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను పెంపొందించడం, సొంత ఆలోచనా శక్తిని పెంచడం, జట్టుగా పని చేసేలా, క్రీడలు ఆడేలా ప్రోత్సహించడం, సంభాషణా నైపుణ్యాన్ని పెంపొందించడంపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే ఆత్మ గౌరవాన్ని పెంపొందించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనం, స్నేహితుల ఎంపిక, తోటి వారిని గౌరవించేలా తీర్చిదిద్దడం, సెల్‌ఫోన్ల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్పించనున్నారు.

అనుమతులు రద్దు చేయాలి

» స్పష్టం చేసిన సిరిసనగండ్ల గ్రామస్థులు, రైతులు

» మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ


తహసీల్దార్ సునీతకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు, రైతులు

చారకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బ్లాక్ గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని సిరసనగండ్ల గ్రామస్థులు, రైతులు అధికారులను కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారగొండ మండలంలోని సిరసన గండ్ల సమీపంలో 182 సర్వే నెంబర్‌లోని 7.7 హెక్టార్లలో బ్లాక్ గ్రానైట్ తవ్వకాలకు ఎండీ మహమ్మద్ హాజీమొద్దీన్ గతంలో అనుమతులు పొందారు. ఆ మేరకు మైనింగ్ క్వారీ నిర్వహణ, పర్యావరణ ప్రభావంపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌స్పెక్టర్ సురేశ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ గ్రానైట్ తవ్వకాలతో తమ కడుపులు కొట్టొద్దన్నారు. దుమ్ము, ధూళితో పంటలు నాశనం అవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ శబ్దాలతో తమకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ క్వారీ నిర్వహణతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. స్వచ్ఛ చలం కోసం ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మైనింగ్ చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. అలాగే మైనింగ్ పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రతీ సంవత్సరం రూ. 3 లక్షలు కేటాయించనున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణపై నివేదికను రూపొందించి, కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా వెల్దండ సీఐ విష్ణువర్దన్‌రెడ్డి, ఎస్‌ఐ శంషుద్దీన్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, ఆర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ పనులు నిలిపివేయాలి

బ్లాక్ గ్రానైట్ తవ్వకాలు చేపట్టకూడదని సిరసనగండ్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ సునీతకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్థులు, రైతులకు సమాచారం లేకుండా అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారని వారు తెలిపారు. తమ పొలాల్లో సాగు చేసిన పంటలు మైనింగ్‌తో దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు కృష్ణయ్య, రామచంద్రమ్మ, బుచ్చమ్మ, బక్కమ్మ, చెన్నయ్య, సురేశ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, అంబేడ్కర్ సంఘం నాయడు వెంకటయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఏడుగురు ఎస్‌జీటీలపై చర్యలు

» జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్


మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 7గురు సెకండరీ గ్రేడ్ టీచర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం అయ్యింది. 2024లో చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉన్నా, అప్పటి డీఈవో రవీందర్ పలు ప్రలోభాలకు తలొగ్గినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పు చేసిన టీచర్ల నుంచి ముడుపులు తీసుకొని వారిపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి. వారిని తప్పించాలని, ఏదో విధంగా కాలయాపన చేయాలన్న ఉద్దేశంతో ఆ ఏడుగురికి సంబంధించిన ఫైల్‌ను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి పంపించారు. ఈ విషయం డీఈవో పరిధిలోకే వస్తుందని, తమకు ఎందుకు ఫైల్ పంపించారని చీవాట్లు పెట్టినట్లు సమాచారం. అంతటితో ఆ ఫైల్ ఆగిపోయింది. అదే సమయంలో అప్పటి డీఈవో రవీందర్ ఏసీబీకీ పట్టుబడటంతో పూర్తిగా మూలన పడింది. తాజాగా స్పౌజ్ పాయింట్ల విషయంలో జీహెచ్‌ఎంలకు ఆర్‌జేడీ నుంచి రెండవ సారి నోటీసులు వచ్చాయి.

దీంతో ఎస్‌జీటీల విషయం మళ్లీ తెరపైకి వచ్చింది ఈ అంశాలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు వరుసకథనాలు ప్రచురితం కావడం కలకలం రేపింది. అందులో భాగంగా ఈనెల 24న ప్రచురించిన కథనం మేరకు డీఈవో కార్యాలయంలో ఎస్‌జీటీ సెక్షన్ సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్నది వీరే..

స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసి, తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలల్లో స్థానం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు సెకండరీ గ్రేడ్ టీచర్ల వివరాలను డీఈవో ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. వి.సురేఖ (మహబూబ్‌నగర్ రూరల్ మండలం, చౌదర్‌పల్లి ఎంపీపీఎస్) బి.శారద (జడ్చర్ల మండలం, కావేరమ్మపేట పీఎస్), డి.విజయలక్ష్మి (ఎంపీపీఎస్, వల్లూరు), ఎం.జ్యోతి (పీఎస్, మాచారం), జె.శివలీల (పీఎస్ ఆలూరు), సంయుక్తా రాణి (అడ్డాకుల మండలం, శాఖాపూర్, పీఎస్) యాదయ్య (భూత్పూర్ మండలం, గోపులాపూర్ పీఎస్)లకు ఇప్పటికే నోటీసులు అందించినట్లు డీఈవో కార్యాలయం ఎస్‌జీటీ సెక్షన్ సిబ్బంది తెలిపారు. ఈ విషయంపై డీఈవో ప్రవీణ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. వారికి గతంలోనే నోటీసులు ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ నోటీసులు ఇవ్వాలా అన్న విషయాన్ని పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ఎలాంటి చర్యలు తీసుకోవాలో మరో రెండు మూడు రోజుల్లో దృష్టి పెడతాం.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

» మహబూబ్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం శాంత


జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీకి ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని మహబూబ్‌నగర్ ఉన్నతపాఠశాల ప్రిన్సిపాల్ శాంత అన్నారు. హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలికల టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు విద్యార్థినులు వర్ష, లాస్యప్రియ, హాస్యప్రియ, సుదీక్ష ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రంలో బుధవారం నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నమెంట్‌లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వారిని అభినందించారు. టోర్నీలో ప్రతిభను చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రజనీకాంత్‌రెడ్డి, జియావుద్దీన్, అహ్మద్‌హుస్సేన్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

'తెలుగు భాషకు అవమానం ఎందుకు?'

పాలమూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషకు అవమానం ఎందుకని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం రాఘవాచారి మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రెండవ భాషగా తెలుగును తొలగిస్తారా? అసలు ఏమి జరుగుతోంది? ఏమి జరగాలి? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మే 3వ తేదీన హైదరాబాద్‌లోని విజ్ఞానకేంద్రం, దొడ్డి కొమరయ్య హాలులో సమాలోచన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభలో చర్చను జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. చర్చల్లో ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఎమ్మెల్సీలు, వాగ్గేయకారులు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, డాక్టర్ శ్రీరంగాచార్య, మోతుకూరు నరహరి, డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ నందిని సిధారెడ్డి, అల్లం నారాయణ, ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, కె.శ్రీనివాస్, కవి యాకూబ్, ప్రొఫెసర్ సాగి కమలాకరశర్మ, డాక్టర్ సిల్వానాయక్, వెల్దండి శ్రీధర్ పాల్గొననున్నట్లు వివరించారు.

దేవాలయాల భూములను కాపాడాలి

» దేవాదాయ అదనపు కమిషనర్‌కు గ్రామస్థుల వినతి


దేవాలయాల భూములను కాపాడాలని దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం రఘుపతిపేట రామగిరి దేవాలయ భూములను కాపాడాలని దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణికి ఆ శాఖ కార్యాలయంలో గ్రామస్థులు, బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. దేవాలయానికి చెందిన 540 ఎకరాల భూముల్లోని 100 ఎకరాలకుపైగా ఉన్న గుట్టను కొంత మంది కాంట్రాక్టర్ ఇష్టారీతిన తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. దేవాలయాల భూములను కాపాడాలని, అక్రమంగా మట్టిని తరలించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ టౌన్ ప్రసిడెంట్ బోడ నరసింహ, పీఎసీఎస్ వైస్ చైర్మన్ శ్యామ్ సుందర్, రాఘుపతిపేట గ్రామస్థులు మల్లికార్జున్‌రెడ్డి, వినయరెడ్డి, రమేష్, సైదులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- మురళి, ఎస్ఐ, కోదండాపురం



ఎర్రవల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ బెట్టింగ్‌లకు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, ఏదైనా లక్ష్యం పెట్టుకొని ఉన్నత శిఖరాలకు చేరేందుకు కష్టపడాలని కోదండాపురం ఎస్ఐ మురళి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల తీరును నిత్యం పరిశీలించాలని అన్నారు. మంగళవారంఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ ఎలా ఉంది?

ప్రతీ గ్రామంలో పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుంది. అసాంఘిక కార్యకలాపాలు చేపట్టకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

మద్యం తాగి వాహనం నడపరాదని, ప్రతీ వ్యక్తి హెల్మెట్ ధరించాలని హెచ్చరిస్తున్నాం. రోడ్లపై నిర్దేశించిన వేగంలోనే వెళ్లాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని వాహనదారులకు చెప్తున్నాం. నిత్యం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం.

అక్రమ రవాణాపై దృష్టి పెట్టారా?

అక్రమ రవాణాను ఉపేక్షించే పరిస్థితిలేదు. రాత్రివేళ తమ సిబ్బంది గస్తీ నిర్వహించి అక్రమ రవాణాదారులను నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. రాత్రివేళల్లో ఇసుక, ఎర్రమట్టి రవాణాను అనుమతి లేకుండా చేయరాదని సూచిస్తున్నాం.

చోరీలు జరుగకుండా ఏం చేస్తున్నారు?

వేసవిలో విహారయాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే కుటుంబాలు విలువైన వస్తువులను ఇంట్లో పెట్టవద్దు. పిల్లలను ఒంటరిగా బావులకు, చెరువుల వద్దకు పంపరాదు. గ్రామాల్లో కొత్తవ్యక్తులు కనిపిస్తే, అనుమానంగా ఉంటే పోలీసులకు సమాచారమివ్వాలి.

న్యూస్ బాక్స్

విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

● జడ్పీటీసీ మాజీ సభ్యురాలు శ్యామల

గద్వాలక్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బాసుశ్యామల డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం బొలెరో వాహనం ఢీకొని గాయపడిన నర్సింగ్ విద్యార్థినులను పరామర్శించారు. మరణించిన విద్యార్థినుల భౌతిక కాయాలను సందర్శించి వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మృతి చెందిన వారి కుటుం బాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ జడ్పీచైర్‌పర్సన్ పరామర్శ

గద్వాల క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మరణించిన నర్సింగ్ విద్యార్థినుల కుటుంబ సభ్యులను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సాయంత్రం పరామర్శించారు. గాయాలపాలైన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. అనంతరం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవితో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్. కేశవ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

బొలెరోను సీజ్ చేసిన పోలీసులు

అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ విద్యార్థినుల మృతికి కారణమైన బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. అయితే ఈ వాహనం గద్వాల్‌లోని బీసీకాలనీకి చెందినదిగా గుర్తించినట్లు సమాచారం. వాహన డ్రైవర్ పరారీలో ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజుతో పాటు ఇంప్రూవ్‌మెంట్, రీకౌంటింగ్, రీవాల్యూయేషన్ ఫీజు చెల్లింపునకు నేడు (బుధవారం) చివరి గడువు అని డీఐఈవో, ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజును తమ పరిధిలోని కళాశాలల్లో, రీకౌంటింగ్, రీవాల్యూయేషన్ ఫీజును మీ సేవలో కూడా చెల్లించుకోవచ్చని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

మల్దకల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మల్దకల్ గ్రామానికి 63 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఎంపీడీవో ఆంజనేయరెడ్డి తెలిపారు. అర్హులను గుర్తించేందుకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, సిబ్బందితో కలిసి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తిరుమలయ్య, మండల ప్రత్యేకాధికారి సంగీతలక్ష్మి, ఎంపీవో రాజశేఖర్ ఉన్నారు.

గ్రామీణ సడక్ బంద్‌ను జయప్రదం చేయండి

అలంపూరు, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మే 20న జరిగే గ్రామీణ సడక్ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. అలంపూరులోని కేవీపీఎస్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.

మునిసిపాలిటీ నుంచి గ్రామాన్ని తొలగించాలి

● పన్నుల భారం భరించలేమంటున్న పైపాడు గ్రామస్థులు ● శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావించిన ఎమ్మెల్సీ చల్లా

వడ్డేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధి నుంచి తమ గ్రామాన్ని తొలగించాలని పైపాడు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వడ్డేపల్లికి మా గ్రామం కన్నా తక్కువ దూరంలో ఉన్న గ్రామాలను విలీనం చేయకుండా, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పైపాడు గ్రామాన్ని ఎలా కలుపుతారని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు వద్దంటున్నా రాజకీయ నాయకులు పట్టించుకోకుండా విలీనం చేయడంవల్ల కూలీలు పనులు లేక రోడ్డునపడ్డారని, ఉపాధి పనులు రద్దు కావడంతో వలసలు వెళ్తున్నారని వాపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు కూడా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల నిర్వహించిన శాసనమండలి సమావేశాల్లో పైపాడు, పర్దీపురం గ్రామాలను మునిసిపాలిటీ నుంచి తొలగించాలనీ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.



పైపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఎమ్మెల్సీకి అభినందనలు



ఇటీవల జరిగిన శాసన మండలిలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మునిసిపాలిటీ నుంచి పైపాడును తొలగించాలని మాట్లాడటం సంతోషంగా ఉంది. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కలెక్టర్ కార్యాలయం వద్ద త్వరలోనే ధర్నా చేస్తాం.

- పరంజ్యోతి, మాజీ సర్పంచ్

అన్యాయంగా కలిపారు..



మా గ్రామాన్ని మునిసిపాలిటీలో అన్యాయంగా కలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు లేకపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తోంది. గ్రామంలో 60శాతం మేర రైతు కూలీలు ఈపనుల మీదే ఆధారపడి జీవిస్తున్నాం.

- గిడ్డెమ్మ, పైపాడు

సీఎం రేవంత్‌రెడ్డికి మొక్కుత..



అప్పట్లో కేసీఆర్ మొండి వైఖరితో పైపాడును మునిసిపాలిటీలో కలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి మొక్కుతా మునిసిపాలిటీ నుంచి పైపాడు గ్రామాన్ని తొలగించాలి. ఐదుకిలోమీటర్ల దూరంలో ఉన్న పైపాడును కలపడం రాజకీయమే. పైపాడులో కూలీలు దొరకక ఆత్మహత్యలు పెరిగే పరిస్థితి నెలకొంది.

- లూజమ్మ, పైపాడు

భూ భారతితో సులభంగా భూసమస్యల పరిష్కారం

- అయిజ అవగాహన సదస్సులో కలెక్టర్

అయిజ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధరణిలో ఉన్న లోపాలను సరిదిద్ది భూసమస్యల కోసం రెండంచెల అప్పీల్ అవకాశం కల్పిస్తూ సమగ్ర భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చే స్తున్నదని కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. అయిజలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 2025భూభారతి (ఆర్ఓఆర్) చట్టం కార్యక్రమాన్ని తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ధరణి స్థానంలో ఏప్రిల్ 14న భూభారతి చట్టం ప్రారంభమైందని తెలిపారు. మనిషికి ఆధార్‌కార్డులాగే భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు త్వరలో జరుగుతుందని, దీనితో భూఆక్రమణ జరగదని అన్నారు. భూభారతి చట్టంలో 23 సెక్షన్‌లు, 18 నిబంధనలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూమి నమోదు చేసుకునే వీలుందన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ జ్యోతి, మండల వ్యవసాయాధికారి జనార్దన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్‌చైర్మన్ కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఎం భరోసా

ప్రమాదం వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బండ్ల

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొట్టడంతో మృతిచెందిన నర్సింగ్ విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి విన్నవించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలియజేశారన్నారు. అలాగే మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ ఫోన్‌లో ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. అంతకుముందు ప్రమాదం విషయం తెలియడంతో ఎమ్మెల్యే హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.



వివరాలను ముఖ్యమంత్రికి ఫోన్‌లో వివరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అలంపూరులోని వివిధ వార్డులకు రూ.ఐదుకోట్ల వ్యయంతో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే విజయుడు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల విచారణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, హౌసింగ్ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు పూర్తిబాధ్యతతో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. వెరిఫికేషన్ ఫామ్ ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా పక్కా సమాచారం రాయాలని, ఇందిరమ్మ కమిటీలు కేటాయించిన జాబితా కచ్చితంగా క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ప్రత్యేక అధికారులు ఉన్నారు.

నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించాలి

గద్వాలన్యూటౌన్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీట్ ప్రవేశ పరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మే 4న మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే నీట్ పరీక్షకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, డీఈవో, చీఫ్ సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఉండవల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాంకింగ్‌లో వివిధ పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోస్టల్ బ్యాంకింగ్ మేనేజర్ శివ అన్నారు. మంగళవారం ఉండవల్లి మండల కేంద్రంలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సువిధా కేంద్రాన్ని మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నుంచి పోస్ట్ బ్యాంకింగ్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు బ్యాంక్ ఖాతాల లావాదేవీలకు సంబంధించిన సేవలు కూడా ఈ కేంద్రంలో లభిస్తాయన్నారు. ప్రజలందరూ పోస్టల్‌ఇన్సూరెన్స్ సేవలను వినియోగించుకుని, భవిష్యత్ భద్రతను మరింత పటిష్టం చేసుకోవాలన్నారు. కాగా, ఉండవల్లి బ్రాంచ్‌ను అడ్డాకుల విజయ్‌కుమార్‌కు అప్పగించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న మేనేజర్, సిబ్బంది

పేద ముస్లింలకు న్యాయం చేసేందుకు కృషి

ఇటిక్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ముస్లింలకు న్యాయం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, నూతన వక్ఫ్ సవరణ చట్టంతో లబ్ధిదారులకు న్యాయం చేకూరుతుందని బీజేపీ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలం సాతర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో వక్ఫ్‌బిల్లు ఆమోదం లభించడంతో వారి హక్కులకు భద్రత లభిస్తుందని, వక్ఫ్ చట్టం వల్ల పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని, ఈ బిల్లుతో సామాజిక న్యాయం జరిగే ఓ ఆధునిక యుగంలోకి ప్రవేశిస్తున్నామన్నారు. వక్ఫ్ బిల్లు క్రమబద్ధీకరించడంతో భవిష్యత్తులో ముస్లిం సమాజానికి ఉపయోగకరమైన ఆర్థిక సమాజానికి ప్రగతికి, ఉపయోగపడతాయన్నారు. వక్ఫ్ పేరుతో అవినీతి జరుగుతుందని, అమాయకులు నష్టపోతారనే విషయాలను కేంద్రం దృష్టికి తీసుకురావడం వల్లే సవరణలు జరుగుతున్నాయన్నారు.

కశ్మీర్ పహల్గాం ఘటనను భారతీయులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

కార్యక్రమంలో వక్ఫ్ సవరణ కమిటీ బీజేపీ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, నాగరాజు, నర్సింహులు, లక్ష్మణ్ గౌడ్, అచ్యుతారెడ్డి, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ఘనంగా ఈదమ్మ ఉత్సవం



క్యాతూరులో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, గ్రామస్థులు

అలంపూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్యాతూరులో ప్రతీ సంవత్సరం నిర్వహించే ఈదమ్మ, సుంకులమ్మ దేవర ఉత్సవాల సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈదమ్మ దేవరను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఈదమ్మ, సుంకులమ్మ ఆలయాల్లో పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఉండవల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక క్యూ లైన్లలో నిలుచుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు చేయాలి

మల్దకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

కొనుగోలు, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో నమోదుపై ఆరా

కేంద్రంలో సౌకర్యాలు తప్పకుండా కల్పించాలని ఆదేశం



మల్దకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

మల్దకల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మల్దకల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగులో కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాలకు రానున్న ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన పలురికార్డులను, ఓపీఎంఎస్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదును పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అన్ని విరాలు రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించే ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించే విధంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిం, స్వయంగా డిజిటల్ తేమ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించారు. కొనుగులో కేంద్రాలకు వచ్చే ధాన్యం తేమ శాతం 17 రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320లతో పాటు రూ.500ల బోనస్ మొత్తం కలిపి రూ.2,820 ఇచ్చేవిధంగా వివరాలు తెలిపే చార్టును రూపొందించాలన్నారు. కేంద్రాల్లో తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్, గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. తూకం చేసిన ధాన్యం సంచులను వెంటనే రైస్ మిల్లర్లకు తరలించే విధంగా ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయిలో లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్వామికుమార్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ కిరణ్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు ఉన్నారు.

డిప్ పద్ధతిన నూతన అభ్యర్థికి బార్

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ మునిసిపల్ పరిధికి సంబంధించిన బార్‌ను ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో డిప్ పద్ధతిన ఎంపికైన కొత్త అభ్యర్థికి కేటాయించినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలోకలెక్టర్ అధ్యక్షతన బార్ కేటాయింపు కోసం వచ్చిన నాలుగు దరఖాస్తులను అభ్యర్థుల సమక్షంలో డిప్ పద్ధతిలో ఎంపిక చేశామన్నారు. బార్‌కు నలుగురు దరఖాస్తు చేసుకోగా నిబంధనల ప్రకారం అభ్యర్థి ఎంపిక చేశామని తెలిపారు. లబ్ధిదారుడు వచ్చే మూడు నెలల్లో లైసెన్స్ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ గణపతిరెడ్డి ఉన్నారు.

జములమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గద్వాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. మహిళల పూనకాలతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. పెళ్లిళ్ల సీజన్ కావడం, విద్యార్థులకు పరీక్షలు పూర్తి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 30వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్ కుమార్ తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుండే భక్తులు క్యూ కడుతున్నారు. ఆలయ గదులతో పాటు పరిసరాలలో షామియానాలు వేసుకొని నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. చీర, రవిక, వెండి పాదాలు, కడియాలు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. ఎండవేడిమి, ఉక్కపోతతో ఇబ్బందిపడ్డారు. అమ్మవారిని శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్‌రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ చైర్మన్ వెంకట్రాములు తీర్థప్రసాదాలు అందించి శేషవస్త్రంతో సత్కరించారు.

స్కావెంజర్ల వేతనాలు పూర్తిగా అందజేయాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ

గద్వాల టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు (స్కావెంజర్లు)లకు ప్రభుత్వం విడుదల చేసిన వేతనాలను పూర్తిగా చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ కోరారు. ఆరు నెలల అనంతరం విడుదలైన వేతనాల్లో కొన్నిచోట్ల ప్రధానోపాధ్యాయులు కోత విధిస్తుండటం విచారకరమన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ వీరశేఖర్‌కు స్కావెంజర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నరసింహ, పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నియమించుకున్న స్కావెంజర్లకు వారి సంఖ్య ఆధారంగా అమ్మ ఆదర్శ కమిటీలు లేదా మహిళా సంఘాల ఆధ్వర్యంలో చెల్లించాల్సిన నిధుల్లో హెడ్‌మాస్టర్లు కోత విధిస్తున్నట్లు అధికారి దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని కార్మికులు ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇంతే ఇచ్చిందని కొంతమందికి, మేము ఇచ్చేది ఇంతే, ఇష్టముంటే తీసుకో లేదంటే ఎక్కడైనా చెప్పుకోండి అంటూ దబాయిస్తుండటం విడ్డూరమన్నారు. దీనికితోడు కొన్ని పాఠశాలల్లోని ప్రధాన ఉపాధ్యాయులు కార్మికుల మధ్య విభేదాలు సృష్టించి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని, వీటన్నింటిని జిల్లా అధికారులు తీవ్రంగా పరిగణించాలన్నారు. నెలల తరబడి పనులు చేస్తూ కుటుంబాల నిర్వహణ కోసం అప్పు చేసిన కార్మికులకు పూర్తిస్థాయి వేతనాలు అందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు రఘు, కార్మికులు రేణుక, సంతోషమ్మ, సువార్త రాధ మల్లమ్మ, హజారంబీ, పార్వతి ఉన్నారు.

ప్రతీనెల పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

గట్టు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతీ నెల 30న పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెప్ప తహసీల్దార్ సలీముద్దిన్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో అంటరానితనం నిర్మూలించి, దళితులకు అన్ని దేవాలయాల్లో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత కాలనీలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ పరిష్కారం కావడం లేదన్నారు. దీంతో సమస్యలతోనే కాలం గడపాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నారు.

ప్రతీనెల నామమాత్రంగా ఒక ఆర్ఐతో పాటు కానిస్టేబుల్ వెళ్లడం ఆనవాయితీగా మారిందని ఇలా కాకుండా అధికారులంతా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మారెన్న, జిల్లా ఉప కార్యదర్శి కేవీపీఎస్ ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోతే సమ్మె నోటీసు ఇస్తాం

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జేఏసీ నాయకులు

గద్వాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలు లేక కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, పాలబిల్లులు కూడా చెల్లించలేదు. ఇలానే కొనసాగితే సమ్మె నోటీసు ఇస్తామని హెచ్చరిస్తూ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం ఉపాధి ఉద్యోగులు అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందించారు. ఉపాధి హామీలో అధికారులు ఇచ్చిన టార్గెట్ మేరకు సెలవు రోజుల్లో కూడా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అయిన తమకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. ఇంట్లో కిరాణం సామాన్లు కొనడానికి అప్పులు చేస్తున్నాం. గ్రామాలకు వెళ్లడానికి ఆటో, పెట్రోల్ ఖర్చులకు కూడా డబ్బులు లేవని వాపోయారు. మూడు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌తోనే చెల్లిస్తున్నారని ఇలాఉంటే తాము ఎలా పనిచేయాలని వాపోయారు. జీతాలు చెల్లించకపోతే సమ్మె నోటీసు ఇవ్వడానికి వెనకాడబోమని, తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన కోరికలు తీర్చకపోతే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్, డీఆర్‌డీవోలకు వినతిపత్రాలు ఇవ్వడం, బుధవారం పెన్‌డౌన్, షట్‌డౌన్ కార్యక్రమాలు, గురువారం సహాయ నిరాకరణ, శుక్రవారం సీఆర్‌డీలో శాంతియుత నిరసనలు, శనివారం మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.